# ఆరవ దొంగ

విశ్వపతి అసహనంగా పక్కమీద దొర్లుతున్నాడు. ఒక విధమైన అశాంతి- సహించలేని బాధ-అతన్ని ఒకచోట కూర్చోనివ్వటంలేదు. నిలబడనివ్వటంలేదు. ఏ పనీ చెయ్యనివ్వటంలేదు.

కొంత సేపటికి పళ్ళు పటపట కొరుక్కుంటూ గుప్పెళ్ళు బిగించి లేచి కూర్చున్నాడు. చల్లటి మంచినీళ్ళు ఒక గ్లాసెడు తాగాడు.

అశాంతి - మనసును పాడుచేస్తున్న అశాంతి - ఎంతకూ తగ్గటంలేదు. ఏం చెయ్యాలి?

ఏమిటి తన బాధ?

ఎందుకొచ్చింది?

అతని కేమీ అర్థం కావటంలేదు. అంతా అయోమయంగా ఉంది.

ఎప్పటినుంచీ ఈ బాధ?

తల గోక్కున్నాడు. తలవెంట్రుకలు చిందరవందర చేసుకున్నాడు. ఒళ్ళు విరుచుకున్నాడు.

“విశ్వపతి!”

ఎవరో పిలిచినట్లయింది.

కొరడాతో కొట్టినట్టుగా ఉందా పిలుపు.

దేహమంతా వణికింది. చెమటపోసింది. స్పృహ తప్పిపోతున్నట్లవుతోంది. మంచంమీదినుంచి కిందికి జారాడు.

అతను కళ్ళుతెరిచి చూసేసరికి భార్యా కూతురూ పక్కనకూర్చునిఉన్నారు.

"ఏమిటి నాన్నా పడిపోయావు? చప్పుడువిని నేనూ, అమ్మా పరుగెత్తుకుంటూ వచ్చాము." రాధిక తండ్రిని కుదిపింది.

''కొంచెం కాఫీ తాగండి. తాగిన తరువాత మెల్లగా చెప్పండి ఏం జరిగిందో. నిన్నటినుంచీ ఒక మాదిరిగా ఉంటున్నారు. తలనొప్పి వచ్చిందేమో-అదే సర్దుకుంటుందిలే అనుకున్నా చికాకయితే చల్లగాలికి తిరిగివస్తే తగ్గుతుందనుకున్నా. రాత్రంతా అశాంతితో మంచంమీద దొర్లుతునే ఉన్నారు.''

అతను వెర్రిచూపులు చూశాడు.

''లేచి స్నానంచేసి పేపరు చదువుకోండి. మనసుకూ, దేహానికీ హాయిగా ఉంటుంది.'' జానకి తడిబట్టతో అతని ముఖం తుడిచి లేపి కూర్చోబెట్టింది.

"అమ్మా! ఎందుకయినామంచిది. డాక్టర్ని పిలుచుకొస్తాను." రాధిక ఆదుర్దా పడుతోంది.

"కొంచెంసేపాగు అసలు ఏం బాధో ఆయన్ను చెప్పనీ." జానకి అతని ముఖంలోకి పరిశీలనగా చూస్తోంది.

విశ్వపతి మళ్ళీ పక్కమీదికి వాలిపోయాడు. అతని బాధ పైకి చెప్పటానికి అతనికే సరిగా అర్థం కావటంలేదు. అది కడుపులోనుంచి బయలుదేరుతున్నట్లున్నది. పైకి ఎగతట్టినట్లనిపిస్తోంది. దాన్ని అణిచిపెట్టటానికి అతను ప్రయత్నం చేస్తున్నాడు. విఫలుడవుతున్నాడు నిరాశా నిస్స్పృహలకు లోనవుతున్నాడు.

విషజ్వరాలకు మందులున్నాయి. మెదడు వ్యాధులకు మందులున్నాయి. గుండె జబ్బులకు మందులున్నాయి. కేన్సరువంటి తిరుగులేని వ్యాధులకుకూడా మందులు కనిపెడుతున్నారు. 'దీనికి మందులేదా?'

విశ్వపతి స్నానంచేశాడు. జానకిచెప్పినట్టుగా పడక్కుర్చీలోకూర్చుని పేపరు చేతపట్టుకున్నాడు. హెడ్‌లైన్సు వెంట కళ్ళు పరుగులు తీస్తున్నాయి. కాని, మనసెటో ఆలోచిస్తున్నది.

గడిచిన రోజున ఏం జరిగింది? ఇదంతా ఎలా ప్రారంభమయింది? మనసు సింహావలోకనం చేస్తున్నది.

ఇంకా నాలుగుగంటలుకాలేదు. వెంకటేశ్వర్లువచ్చి ఒకమాట చెవినవేశాడు.

ఆ హాల్లోఉన్న ప్రతికుర్చీదగ్గరికీ పరుగులుతీశాడు. అందరూ 'నిజమా?'అనుకుంటూ లేచారు.

హాలంతా కోలాహలంగాఉంది. అందరూలేచి గంగాధరం దగ్గరికెళ్ళి అతని చెయ్యిపట్టుకునీ, భుజాలుపట్టుకునీ ఊపేస్తున్నారు.

''లేవ్వయ్యా మాకు స్వీటూ, హాటూ ఇప్పించు'' అంటున్నారు.

తను కూర్చున్న చోటినుంచి లేవలేదు. తల బల్లమీద వాలిపోయింది. కళ్ళు మూతలుపడ్డాయి. కొంత సేపటికి బలవంతంగా కళ్ళు తెరిచాడు. చీకట్లు కమ్మటం ఇంకా తగ్గలేదు. జేబురుమాలుతో ముఖం తుడుచుకుని హాలంతా కలయజూశాడు. అంతా ఖాళీగాఉంది. అందరూ వెళ్ళిపోయినట్లున్నారు. ప్యూన్లుకూడాలేరు.

లేచి మెల్లగా బస్స్టాండు చేరుకున్నాడు. రెండు బస్సులు ఆగకుండానే వెళ్ళాయి. మూడవదాంట్లో ఎక్కి నిలబడే ఇంటికి చేరుకున్నాడు.

ముఖం ముడుచుకుని విసుక్కుంటూ, జానకి తెచ్చిన కాఫీ అందుకుని, ఖాళీ చేసి, గ్లాసు కింద పెడుతూ ''ఇంకా నయం. రోడ్డుమీదికి ఎదురుగావచ్చావు కాదు కాఫీ గ్లాసుతో. అయినా-ఏమిటా తొందర? ఇంటికి వచ్చినవాడిని కాఫీ అడగనా-తాగనా? చికాకుపడ్డాడు.

"ముఖం అలిసిపోయినట్టుగా ఉంటే కుర్చీలో కూర్చోమని కాఫీ గ్లాసు చేతికిచ్చానంతేగా?" సర్దబోయింది.

ముఖం పక్కకు తిప్పుకున్నాడు.

రాత్రి పడుకుంటే కంటిమీదికి నిద్ర రాలేదు. కడుపులోనుంచి ఆవేదన ఎగిసెగిసి పడుతున్నది. ఆ గంగాధరంగాడికి ప్రమోషన్మీద ట్రాన్స్ఫరా? ఏం ఘనుడని? ఎఫిషెంటా? ఇంటలిజెంటా? చచ్చురకం-సగటు మనిషి పైగా కరప్టు. మర్యాదా మంచీ కూడా లేవు సరికదా- పెళుసు. అన్నిటికంటే బాధాకరమైన విషయమేమిటంటే తనకంటే జూనియరు. అతని గ్రేడు వేరనుకున్నాగాని - నిన్నకాక-మొన్న చేరాడే?

విశ్వపతికి ఒళ్ళంతా తేళ్ళూ జెర్రులూ పాకినట్లయింది. ప్రపంచమంతా తలకిందులైనట్టుంది.

"అబ్బా!" కణతలు నొక్కుకున్నాడు.

''విశ్వపతీ!''

ఒళ్ళు జలదరించింది.

ఎందుకంతబాధ? ఉద్యోగాలన్న తరువాత ప్రమోషన్లు కాస్త ముందూవెనకా వస్తూఉంటాయి. జూనియర్లయినా సరే. అసలు-కొంత అదృష్టంకూడా ఉండాలి. అయినా-ఎవరికో వస్తే తన కెందుకు బాధ కలగాలి? అతనంటే తనకు మొదటి నుంచీ పెద్ద ఇష్టంలేదు. కాంటీన్‌లో ఒకటి రెండుసార్లు పలకరించబోయాడు. తను హలో అని తప్పుకున్నాడు.

అసలు-తనుకూడా అందరితోపాటు అతని దగ్గరికెళ్ళి కంగ్రాట్సు చెప్పి, నలుగురితోపాటు ఒక స్వీట్ ప్రాణం బిగబట్టుకుని తింటే ఎలా ఉండేది? అప్పుడింత బాధ కలిగేదా?

ఏమో! తన మనసు ఒకింతకు వినేదికాదు-మహా మొండిది.

రాజకీయాల్లో ఓటమీ, గెలుపూ రెండూ ఉంటాయికదా! ఓడిపోయిన పార్టీ నాయకుడు గెలుపొందిన సభ్యుడి పేరు సభలో ప్రతిపాదిస్తాడు. నలుగురితోపాటు అభినందిస్తాడు. అతను మనసారా చేస్తున్నపనా అది? కాదని అందరికీ తెలుసు. కాని - అది ఒక ఆచారంగా వస్తున్న మర్యాద. దానివల్ల మనసులో భారం కొంతయినా తగ్గినట్లవుతుందేమో?

పెళ్ళిళ్ళూ అంతే. అనుకున్నవీ ఆశలు పెంచుకున్నవీ కావు. అటువంటి సందర్భాల్లో అంతటితో మనస్పర్థలు పెంచుకోవటమేనా? పిల్ల తండ్రి గాని, పిల్లవాడి తండ్రిగాని ఒకరింట్లో పెళ్ళికి మరొకరు వెళ్ళి, నలుగురితోపాటు అక్షింతలు వేసివస్తే ఎప్పటిలా మనసులు విప్పుకొని మాట్లాడుకోవచ్చు. భారం కొంత తగ్గినట్లవదూ? కాని-అట్లా జరగదు లోకంలో ఎందుకని?

తను స్కూలుఫైనలు పరీక్ష తప్పాడు. చదివినా-సమయానికి బాగా రాయలేకపోయాడు. తనతో రెండోక్లాసునుంచి చదువుతూ వస్తున్న ప్రాణస్నేహితుడు మంచి మార్కులతో పాసయ్యాడు అప్పటినుంచీ అతని ముఖం చూడటానికి బుద్ధి పుట్టటంలేదు. పైగా తలపుకొస్తేనే ఏదో బాధగా ఉంటుంది. అతడొక పెద్ద శత్రువైపోయాడు.

విశ్వపతి బి.ఏ. ప్యాసయిన తరువాత ఒక ఇంటర్వ్యూకి వెళ్ళాడు. అప్పటికి పదిమంది కూర్చునిఉన్నారు. అందరూ ఇంటర్వ్యూలో బాగానే చేశామనుకున్నారు. ఉన్న పోస్టులు నాలుగంటే నాలుగు. పదకొండుమంది అభ్యర్థులు. పదిరోజులయిన తరువాత నోటీసు బోర్డుమీద ఉన్న పేర్లు నాలుగు. వాటిలో తన పేరులేదు. పళ్ళు పటపటలాడించాడు. కాళ్ళీడుస్తూ బయటికి అడుగులు వేస్తున్నాడు. సెలెక్టు అయిన వాళ్ళను కానివాళ్ళు అభినందించి, హోటల్‌కు తీసుకువెళ్ళుతూ తననుకూడా పిలిచారు. తనకు వెళ్ళడానికి ఇష్టం లేకపోయింది. ఏ ముఖం పెట్టుకుని వాళ్ళను అభినందించటం? వాళ్ళతో కబుర్లు చెబుతూ కాఫీలూ, టిఫిన్లూ ఎలా తీసుకోవటం? తనవల్ల కాదు.

తన జీవితంలో ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయి. కాని, తనలో మాత్రం మార్పు రావటంలేదు.

విశ్వపతి బావమరిది సూర్యం రెండు నెలల కొకసారయినా చెల్లెల్ని చూడటానికి వస్తాడు అతను చాలా సందడి మనిషి. ఎదటివాళ్ళలో ఉత్సాహాన్నీ ఉల్లాసాన్నీ కలిగిస్తాడు కవ్వించి మాట్లాడిస్తాడు. అతని చాకచక్యం విశ్వపతి ముందర ఎందూకూ పనికి రావటంలేదు.

ఇటీవల వచ్చినప్పుడు ''బావగారూ! మన రాధికకు ఒక మంచి సంబంధం చూశాను. అబ్బాయి సి.ఏ. పరీక్ష ప్యాసయ్యాడు. చాలా బాగుంటాడు. చాలా చురుకైనవాడు. మన రాధిక ఫోటో చూసి అమ్మాయిని చూడటానికి వస్తానన్నాడు. ఆ మాట జానకికి చెప్పాలని వచ్చాను'' అన్నాడు.

'అ( తను ఆమాత్రపు సంబంధం చూడలేడా? అయినా అప్పుడేవమయింది? రాధికను ఇంకా చూడాలి అతను చూసినతరువాత ఒకరికొకరు నచ్చాలి. షరతులు కుదరాలి. జాతకాలు కలవాలి. అప్పుడుకదా సూర్యం సంబంధం కుదిర్చా ననుకోవట మనుకున్నాడు-విశ్వపతి.

కాని-సూర్యం ఒక వారంరోజుల్లో అన్నిపనులూ పూర్తిచేశాడు. అబ్బాయీ, అమ్మాయీ ఒకరి కొకరు నచ్చారు. జానకికికూడా నచ్చాడు. అబ్బాయికి కట్నాల పట్టింపులేదు. జాతకాలు కుదిరాయి. పురోహితుడు లగ్నంకూడా పెట్టాడు.

"బావగారూ, నేను వెళ్తాను. చెయ్యదలచుకున్నపని పూర్తిచేశాను. నన్ను

రమ్మనిపిలిస్తే వచ్చి పెళ్ళిపనులు చేసిపెడతాను. మీరే చేసుకుంటామంటే వేళకు వస్తాను" అన్నాడు.

విశ్వపతికి చురక తగిలినట్లయింది. తను నాలుగేళ్ళనుంచీ ప్రయత్నం చేస్తున్నాడు అమ్మాయికి పెళ్ళి చెయ్యాలని. ఒకటిఉంటే ఇంకోటి లేని సంబంధాలు కనబడ్డాయి. ఒకటీ నచ్చలేదు తనకీ. ఇక రాధికకేం నచ్చుతాయి? జానకి పోరు ఎక్కువవుతోంది. అప్పుడప్పుడు కోపాలు వస్తున్నాయి ఇద్దరికీ. ప్రయత్నాలు ఫలించక నిరాశకూడా కలిగింది. ఇక తను పిల్లకు పెళ్ళి చెయ్యలేననుకుని అధైర్యపడ్డాడు. సరిగ్గా అటువంటి సమయంలో సూర్యం మంచి సంబంధం కుదిర్చాడు. జానకి ముందర కాలరెత్తుకొని తిరుగుతున్నాడు.

తన అసమర్థతను చక్కగా ఎత్తిచూపించాడు. తనకు తల కొట్టేసినట్టుగా ఉంది. అతనేమయినా ఘనుడా? ఉద్యోగం చేయటం చేతకాక వ్యవసాయం చేసుకుంటున్నాడు.

తెల్లవారి విశ్వపతి మంచం దిగలేకపోయాడు. మాట నీరసంగా వస్తోంది.

"నాన్నా! అమ్మ లేవమంటోంది. ముఖం కడుక్కో కాఫీ తాగుదుగాని రా" రాధిక మంచం దగ్గరికొచ్చింది.

"ఇప్పుడు లేవలేను. కొంచెంసేపయిన తరువాత లేస్తాలే"

"నాన్నా నీరసంగాఉందా? బ్రష్ పేస్టు తెస్తాను. అమ్మనడిగి బేసిన్ తెస్తాను"

''వద్దులే నేను వస్తాగా''

రాధిక వెళ్ళి చెప్పగానే జానకి వచ్చింది.

''రాత్రి నిద్రపట్టిందా? ఏమిటీ ఇంత నీరసపడిపోయారు? రాత్రి అన్నం సహించలేదా ఏమిటి?''

జ్వరం వచ్చిందేమోనని నుదురుపట్టి చూసింది. మామూలుగా ఉంది.

''నా చెయ్యి పట్టుకుని మెల్లగా లేచిరండి. ముఖం కడుక్కుని వేడివేడి కాఫీ తాగితే అన్నీ సర్దుకుంటాయి.''

"నీకు తెలియదు జానకి. నేను లేవలేను"

"మీకు ఏమీ కాలేదు. మేమిద్దరం పట్టుకుంటాము. మెల్లగా నాలుగడుగులు వేసి భోజనాల గదిలోకి రండి"

బలవంతంగా లేవదీసి ఇద్దరూ పట్టుకుని సింకు దగ్గరికి తీసుకువెళ్ళారు. ముఖం కడుక్కుని బల్లదగ్గర కుర్చీమీద కూర్చున్నాడు.

"ఈ కాఫీ తాగండి. ముఖం తేటగా ఉంటుంది"

విషంతాగినట్టు తాగి గ్లాసుకిందపడేశాడు. ఆ ఇద్దరి బలవంతంమీద స్నానం చేసి మంచంమీద వాలాడు.

"అమ్మా! నీవు వద్దంటావుగాని డాక్టర్ని పిలుద్దామమ్మా" రాధిక తొందర పడుతోంది.

"ఏమయిందని పిలుస్తావు?"

"వచ్చి ఆయనే చూస్తాడుగా. ఏమయిందో?"

"భోజనంచేస్తే అన్నీ సద్దుకుంటాయి." జానకి వంటచేసి పదిన్నరకే వడ్డించింది.

చారూ, మజ్జిగతో గుప్పెడు అన్నం తిని లేచాడు విశ్వపతి.

"నోటికి హితవుగాలేదా అన్నం? ఇలా అయితే ఆఫీసుకు వెళ్ళి పనేం చేస్తారు?"

"సెలవు పెట్టాను"

"ఎన్ని రోజులు?"

"వారం రోజులు పెట్టాను"

"ఇప్పుడే సెలవంతా ఖర్చు చేస్తారా? అమ్మాయి పెళ్ళికి పది రోజులయినా సెలవు పెట్టద్దూ?"

"అప్పటివరకూ ఉంటే అలాగే తీసుకుంటాలే" కనుబొమలు ముడేసుకుంటూ విసుక్కున్నాడు.

అతి కష్టంమీద మరో రెండురోజులు గడిచాయి. అతనిలో మార్పులేదు. బాగా నీరసించిపోయాడు. జానకి ఆలోచనలో పడింది. రాధిక వెళ్ళి డాక్టర్ని తీసుకువచ్చింది.

ఆయనను చూడగానే విశ్వపతి లేచి కూర్చున్నాడు.

''ఏమిటండీ ఎక్కడ బాధ? జ్వరం వచ్చిందా? ఊళ్ళో వైరస్ ఫీవరు ఉందిలెండి'' థర్మామీటరు పెట్టి చూశాడు.

''జ్వరంలేదు. మరేమిటి, కడుపునొప్పా?'' అడిగాడు కడుపు నొక్కి చూస్తూ.

''లేదండీ నొప్పిలేదు.''

''డాక్టరుగారూ, ఆయన ఎక్కడా బాధలేదంటారు. సరిగా భోజనం చేయటంలేదు. ఏమిటో పిచ్చిచూపులు చూస్తారు చికాకు పడతారు. కాఫీ, పాలు, ఏవీ నచ్చటంలేదు. సరిగా నిద్రకూడా లేదనుకోండి. మనిషి నీరసించిపోతున్నారు. ఆఫీసుకు వెళ్ళలేరు. సెలవుపెట్టారు అమ్మాయికీ, నాకూ ఏమీ తోచటంలేదు.'' జానకికి కళ్ళనీళ్ళ పర్యంతమయింది.

''ఈయనను మా నర్సింగ్‌హోమ్‌లో చేర్పించండి. అన్ని పరీక్షలూ చేసి చూస్తాను.''

''ఎన్నిరోజులు ఉండాలి?'' జానకికి ఆదుర్దా అధికమయింది.

''కనీసం వారంరోజులు ఉండాలి''

డాక్టరు వెళ్ళగానే కావలసినవస్తువులు తీసుకుని రాధిక, జానకి ఆటోలో నర్సింగ్‌హోమ్‌కు చేర్చారు విశ్వపతిని.

"చూడండమ్మా, మీరిద్దరూ ఇంటికి వెళ్ళండి. ఆయనకు భోజనం పంపించండి. సాయంత్రపు వేళల్లో ఎప్పుడైనా వచ్చిచూడండి. ఆయనను చూడటానికి మావాళ్ళున్నారు. మీరు నిశ్చింతగా ఇంటికి వెళ్ళిరండి" అని విశ్వపతికి ఒక గది ఏర్పాటుచేసి వాళ్ళను పంపించాడు డాక్టరు.

విశ్వపతికి భోజనం, మందులూ తప్పనిసరిగా తీసికోవలసి వచ్చింది.

మంచంమీద పడుకుని ఏదో ఆలోచిస్తూ ఉంటాడు. ఎప్పటెప్పటి సంగతులో జ్ఞాపకానికి వస్తున్నాయి.

ఏమిటీ జీవితం? బుద్ధితెలిసిన తరువాత ఒక్కనాడయినా సంతోషంగా గడిపాడా? తండ్రి లేకపోయినా తల్లీ, బామ్మా కళ్ళల్లో పెట్టుకుని పెంచారు. ఆప్యాయంగా చూసుకునేవారు.

విశ్వపతికి తల్లికంటే బామ్మమీద ప్రేమ అధికంగాఉండేది. తెల్లవారుజామున చల్లచేస్తూ పాటలుపాడేది. ఎనిమిదిగంటలకే ఇంత వెన్నముద్దవేసి ఊరగాయతో అన్నం పెట్టేది. సెలవుల్లో స్వంతఊరు తీసుకెళ్ళేది.

అతని ఆలోచనలకు అడ్డంవస్తూ ఉండేవాడు డాక్టరు. రోజు కొక పరీక్ష చేస్తూ ఉండేవాడు. రాధికవచ్చి డాక్టరుతో మాట్లాడి తండ్రిని పలకరించి కొంచం సేపు కూర్చుని వెళ్ళేది.

''అమ్మాయీ, ఈసారి మీ అమ్మగారిని పంపించమ్మా'' అన్నాడు డాక్టరు.

జానకి భయపడుతూ వచ్చింది. "ఏమయింది డాక్టరుగారూ నన్ను రమ్మన్నారట?" నిలబడి చేతులు జోడించింది.

"భయపడకండి ఇలా విశ్రాంతిగా కూర్చోండి. మిమ్మల్ని రమ్మన్నది గాభరా పెట్టటానికికాదు. విశ్వపతిగారికి అన్ని విధాలా బాగుంది. ఇక్కడికి వచ్చినతరువాత మా నర్సులు బలవంతంచేసి ఆహారం ఇస్తున్నారు. మీరు పంపిన పాలు, పళ్ళూ వేళకు ఇస్తున్నారు. నేను వారంరోజులకంటే ఎక్కువగానే మా నర్సింగ్‌హోములో కావాలని ఉంచాను. ఆయన బరువుకూడా పెరిగింది.

"అయితే ఇంటికి తీసుకువెళ్ళమంటారా డాక్టరుగారూ?" సంభ్రమంతో అడిగింది.

"తీసుకువెళ్ళచ్చు దానికేముంది? కాని-నేను మీతో ముఖ్యంగా చెప్పదలచుకున్న దేమిటంటే-ఆయనకు మనసులో ఏదో వ్యాకులత-ఏదో బెంగ ఉన్నట్టు నాకు అనిపిస్తోంది. ఏవైనా వ్యసనాలున్నాయా? డబ్బుకుసంబంధించిన బాధలున్నాయా? అప్పులేవయినా చేశారా?" ఆమె ముఖంలోకి పరిశీలనగా చూశాడు.

డాక్టరుగారూ! మా పెళ్ళయి పాతిక సంవత్సరాలయింది. ఆయనకు ఎటు

వంటి వ్యసనమూలేదు. ఈ కాలంలో సిగరెట్ అలవాటులేని వాళ్ళెవరయినా ఉన్నారా? ఆయన కదికూడలేదు. గుర్రపుపందేల జోలికిపోరు. స్త్రీ వ్యసనంకూడా ఆయనకులేదు. డబ్బుపిరివిగా ఖర్చుచెయ్యరు. అప్పుచేయవలసిన అవసరంలేదు. ఆయన ఆ రోజుకు ఎంతకావాలో అంత డబ్బు జేబులో వేసుకుంటారు. స్కూటరు కొనమంటే 'అమ్మాయి పెళ్ళి అయిన తరువాత' అంటారు. ఇక బెంగ దేనికి? నాకు అర్థం కావటంలేదు."

'డాక్టరు నవ్వుకున్నాడు. ప్రతి భార్యా తన భర్త నిజాయితీపరుడనీ, వ్యసనాలు లేనివాడనీ, తనతో చెప్పేదంతా నిజమేననీ అనుకుంటుంది. అంత నమ్మకంగా వ్యవహరిస్తాడు మగవాడు తన భార్య దగ్గర. పాపం అమాయికలు అవన్నీ నమ్ముతారు.'

"నాకు ఆయనకుజబ్బున్నట్టు కనబడలేదు. నా వృత్తిధర్మం కనుక అడిగానంతే. ఏమనుకోకండి" అన్నాడు లేస్తూ.

ఆ మరునాడు విశ్వపతి ఇంటికివచ్చాడు. డాక్టరు చెప్పినట్టుగా, నర్సులు చేసినట్టుగా తల్లీ, కూతుళ్ళు అతన్ని కనిపెట్టి చూస్తున్నారు.

''అమ్మాయి పెళ్ళిదగ్గరికొచ్చింది. ఈయన వరసచూస్తే ఇలాఉంది. పనులెట్లా అవుతాయి?'' అనుకుంటోంది జానకి.

"లేచి వాకిటిముందర నాలుగడుగులు వెయ్యండి. అలా పడుకుంటే ఉన్న సత్తువకూడా పోతుంది."

జానకి మధ్య మధ్య విశ్వపతిని లేపి కూర్చోబెడుతూ ఉంటుంది. అతను కూర్చున్నట్టే కూర్చుని మళ్ళీ పడుకుంటాడు.

విశ్వపతికి ఈ మధ్య వారంరోజులనుంచి బామ్మ కలలోకివచ్చి, 'విశ్వపతీ' అని పిలుస్తోంది. అతను కళ్ళు నలుపుకుంటూ బామ్మ నిజంగా ఎదుట నిలబడిందేమో ననుకుంటూ సంభ్రమంతో లేచి కూర్చుంటున్నాడు. 'బామ్మ ఇప్పుడెక్కడుంది? పోయి ఇరవై ఏళ్ళయింద'నుకుంటూ మళ్ళీ పడుకుంటాడు.

కిందటి రోజు మాత్రం "ఒరే విశ్వం? మేలుకో మేలుకో" మంటూ "నేను చెబుతునే ఉన్నాను. విన్నావుకాదు. ఆ ఆరోదొంగ నీలో జొరబడ్డాడు. నిక్షేపాన్ని

కాస్తా కాజేశాడు" వీపు తట్టి బామ్మ చెప్పినట్లయింది. వీపు తడుముకున్నాడు. ఆమె వీపు తట్టిందంటే కొట్టినంత బాధగా ఉండేది.

బామ్మ స్పష్టంగా 'దొంగ జొరబడ్డాడు. నిక్షేపాన్ని కాజేశా'డంటోంది ఏమిటి?' మంచంమీద కూర్చుని తల తడిమి చూసుకున్నాడు.

ఆమె తన చిన్నప్పుడూ దొంగలు పడతారని ఏవో పాటలు పాడుతూ ఉండేది. శ్లోకాలుకూడా చదివేది. 'ఆరుగురు దొంగలూ పొంచి ఉన్నారూ' అంటూ పాడేది. 'నాలుగుజాములకు నాలుగుశ్లోకాలురా' అంటూ 'తస్మాత్ జాగ్రత్త జాగ్రత్త' అంటూ చదివేది. ఆ ఆరుగురు దొంగలూ ఎవరూ? ఇంట్లోనో, వంట్లోనో జొరబడి నిక్షేపాన్ని దొంగిలించట మేమిటి? ఈ దొంగల సంగతి అప్పుడెంత అర్థమైందో ఇప్పుడూ అంతే. ఎవరువారు? ఎవరు? ఆ నిక్షేప మేమిటి?

ఇప్పుడు ఆరో దొంగ జొరబడ్డాడనీ, నిక్షేపాన్ని కాజేశాడనీ స్పష్టంగా వీపు తట్టి చెప్పింది. అతని కేమీ పాలుపోవటంలేదు. పైగా చికాకు పుట్టుకొస్తోంది అయోమయంలోనుంచి.

"అమ్మా! సూర్యం మామయ్య వచ్చాడే" రాధిక తలుపు తియ్యటానికి పరుగుతీసింది.

"దేవుడిలా దిగాడే? పెళ్ళి పనులెట్లాగా అని బెంగ పెట్టుకున్నాను. మామయ్యకు కాఫీ కలిపియ్యి. నేనూ వస్తున్నాను" జానకి విశ్వపతి పక్కదులిపి గది శుభ్రం చేస్తోంది.

సూర్యం పేరు వినగానే విశ్వపతి అదిరిపడ్డాడు. అతనిలోని తమోగుణం - బామ్మ చెప్పే ఆ ఆరవదొంగ విజృంభించాడు.

"బావగారూ! ఒంట్లో బాగాలేదా? చాలా బలహీనంగా ఉన్నారు నేను చూసినప్పటికంటే. ఏమిటే జానకీ. నాకు ఉత్తరమైనా రాయలేదు? రాధికా, నీవేం చేస్తున్నావు?" విశ్వపతి మంచానికి దగ్గరగా వచ్చాడు.

"ఏమిటీ? నాకు ఒంట్లో బాగాలేదా? నీరసించిపోయానా? నాకు చేతకాదని నా కూతురిపెళ్ళికి పెత్తనం చేయాలనివచ్చావా? నే నంత పనికిమాలిన వాడి ననుకున్నావా? చాల్లే నీ ప్రయోజకత్వం?" అంటూ విసురుగా కుర్చీమీదినుంచి లేచి సూర్యాన్ని ఒక్కతోపుతోశాడు.

"పో! నీ ప్రయోజకత్వం నీ ఇంట్లో చూపించుకో" ఆవేశం వచ్చినందువల్ల ముఖమంతా ఎర్రబడ్డది. ఒళ్ళు వణికినట్లయింది.

"మీరు ప్రశాంతంగా పడుకోండి. మేము అవతలికిపోతాం'' అంటూ సూర్యాన్నీ రాధికనూ మరో గదిలోకి తీసుకువెళ్ళింది జానకి.

విశ్వపతి ఆయాసపడుతూ మంచంమీద వాలాడు. ఆరోదొంగ ఎవరో-ఆలోచిస్తే ఈమారు అర్థమైనట్టయింది అతనికి.